



# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం

సంపుటి : 3 | సంచిక : 309 | జూలై 7 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-








## ములుగు జిల్లాలో

# పాఠాలు చెప్పాల్సిన పంతులు... గిరిజన ఇసుక సొసైటీలో అనధికార జోక్యమా..?






గిరిజన సంపదపై
వ్యక్తిగత లాభం కోసమేనా?
సమాధానం చెప్పాల్సిందే!

**మన దునియా,ములుగు జిల్లా: జూలై 06**

ములుగు జిల్లా: గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఇసుక సొసైటీల నిర్వహణపై పలు ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఒక వ్యక్తి గిరిజన ఇసుక సొసైటీల వ్యవహారాల్లో అనధికారికంగా జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొంతమంది స్థానికులు, సొసైటీ ప్రతినిధుల ఆరోపణల ప్రకారం, ఇసుక రీచ్‌ల నిర్వహణ, కాంట్రాక్టర్లతో సమన్వయం, సొసైటీల నిర్ణయాల్లో ప్రభావం చూపుతున్నారని చెబుతున్నారు. అలాగే కొన్ని సొసైటీల నుంచి ఆర్థిక వాటాలు కోరుతున్నారని, ఇవ్వని పక్షంలో మీడియా సమావేశాలు, ఫిర్యాదులు లేదా ఇతర మార్గాల ద్వారా ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.అంతేకాకుండా, గిరిజన ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టాన్ని ప్రస్తావిస్తూ కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారనే వాదనలు కూడా ఉన్నాయి. అయితే, సంబంధిత వ్యక్తి స్పందన కూడా వెలువడాల్సి ఉంది.ఈ నేపథ్యంలో స్థానికులు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడికి గిరిజన ఇసుక సొసైటీల నిర్వహణతో సంబంధం ఏమిటి? విధి నిర్వహణకు భంగం కలిగేలా ఇతర కార్యకలాపాల్లో పాల్గొంటున్నారనే ఆరోపణల్లో వాస్తవం ఎంత? సొసైటీల వ్యవహారాల్లో (మిగతా 2వ పేజీలో..)

- ఒక ఉపాధ్యాయుడు ములుగులో ఉంటూ గిరిజన సొసైటీలపై పెత్తనం చెలాయిస్తున్నాడా..?
- ప్రతి సొసైటీ నుంచి కోట్ల రూపాయల విలువైన ఇసుక వ్యాపారంపై అనధికార జోక్యం ఉందనే ఆరోపణలు.
- సొసైటీలపై పెత్తనం, ఆర్థిక లావాదేవీల ఆరోపణలు...
- విచారణ చేపట్టాలంటున్న స్థానికులు
- గిరిజనుల హక్కులను కాలరాస్తున్న ఆధికార దుర్వినియోగం ఆపాల!

## గిరిజన సొసైటీలపై పెత్తనం వెనుక అసలు నిజాలు ఏమిటి..?

---

## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- పర్యాటక రంగంపై సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష
- తెలంగాణను అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- తారామతి బారాదరి, దుర్గం చెరువు అభివృద్ధికి ఆదేశాలు
- వికారాబాద్, వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టి
- మరిన్ని ఎకో పార్కులు, ఫ్యూచర్ సిటీలో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులు
- పురానాపూల్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే ప్రతిపాదన

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు (మిగతా 2వ పేజీలో..)



---

# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

- బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు
- భగీరథ్‌కు బెయిల్ ఇవ్వొద్దని బాధితురాలి తరపు న్యాయవాది వాదన
- సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వివరణ

బాధితురాలి వాంగ్మూలం (మిగతా 2వ పేజీలో..)



---

## బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు: పొన్నం ప్రభాకర్

- అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో భారీ అవినీతి జరిగిందన్న పొన్నం ప్రభాకర్
- ఈ స్కామ్ కు మోదీ, అమిత్ షా, యోగి బాధ్యత వహించాలని డిమాండ్
- దేశ ప్రజలకు బీజేపీ క్షమాపణలు చెప్పాలన్న పొన్నం

అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో కోట్ల రూపాయల భారీ అవినీతి జరిగిందంటూ తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ ఎదుగుదల (మిగతా 2వ పేజీలో..)



---

## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం.. స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు

- ఇండోనేషియాకు చేరిన ప్రధాని మోదీ
- స్వయంగా వచ్చి ఆహ్వానించిన అధ్యక్షుడు ప్రబోవో
- యుద్ధ విమానాలతో మోదీ విమానానికి ఎస్కార్ట్
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు
- ప్రంబనన్ ఆలయ సముదాయం సందర్శించనున్న మోదీ
- రక్షణ, వాణిజ్య సహకార విస్తరణపై దృష్టి

మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేషియా రాజధాని జకార్తాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన కోసం అక్కడి చేరుకున్న ఆయనకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం విశేషం. ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత (మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ములుగు జిల్లాలో పాఠాలు చెప్పాల్సిన పంతులు... గిరిజన ఇసుక సొసైటీల్లో అనధికార జోక్యమా..?

(మొదటి పేజీ తరువాయి)

అనధికార జోక్యం జరిగిందా?గిరిజనుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సొసైటీలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు నిష్పక్షపాత విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అవాస్తవమైతే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరదించాలని వారు అభిప్రాయపడుతున్నారు.

## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ దిశగా ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.తారామతి బారాదరిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును పూర్తిస్థాయి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లను ఆధునికీకరించాలని చెప్పారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని, అక్కడి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి యాదాద్రి తరహాలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పర్యావరణహిత పర్యాటకానికి ప్రాధాన్యమిస్తూ 'క్యూర్' పరిధిలోని అటవీ భూములను 'ఎకో టూరిజం' కింద అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు.పాతబస్తీలోని చారిత్రక పురానాపూల్ వంతెనను ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. అవసరమైతే అక్కడి ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని అధికారులకు తెలిపారు.

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి)

ఆధారంగా అభియోగాలను సవరించినట్లు పోలీసుల వెల్లడి

నిందితుడు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని ప్రాసిక్యూషన్ వాదన

పోక్సో కేసులో అరెస్టైన బండి భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టును కోరారు. నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో కేసుపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. ఇంకా పలువురు సాక్షులను విచారించాల్సి ఉందని తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరైతే వారిపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. భగీరథ్ జైలులో ఉంటేనే దర్యాప్తు పారదర్శకంగా సాగుతుందని పేర్కొన్నారు. మరోవైపు పేట్‌బషీరాబాద్ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్‌లో కీలక అంశాలను ప్రస్తావించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసిన తర్వాత ఆరోపణల తీవ్రత దృష్ట్యా అభియోగాలను సవరించినట్లు కోర్టుకు వెల్లడించారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం నిందితుడు స్నేహం పేరుతో పరిచయం పెంచుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు.



## బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు: పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

కోసం దేవుడిని వాడుకోవడంలో బీజేపీ పరాకాష్ఠకు చేరిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు తమ స్తోమతకు తగినట్లుగా రామయ్య గుడి కోసం విరాళాలు ఇస్తే, కమలం పార్టీ నేతలు ఆ సొమ్మును కూడా వదలకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు."బీజేపీ నాయకులు శ్రీరాముడి పేరును, అక్షింతలను అడ్డం పెట్టుకుని ఇళ్ల వెంట తిరిగి విరాళాలు వసూలు చేశారు. తీరా చూస్తే ఆ నిధుల్లోనే కోట్లాది రూపాయల అవినీతికి తెరలేపారు. దేవుడి హుండీలోని సొమ్మును సైతం లూటీ చేయడం దేశ ప్రజలందరినీ అవమానించడమే" అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతల అసలు రంగును, వారి అవినీతి అక్రమాలను అక్కడి స్థానిక ప్రజలు ముందే గుర్తించారని... అందుకే అయోధ్య పరిధిలోని లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిని అక్కడి ఓటర్లు ఓడించి బుద్ధి చెప్పారని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు.భక్తి వేరు, రాజకీయం వేరని స్పష్టం చేసిన మంత్రి... ఈ విరాళాల కుంభకోణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లదే పూర్తి బాధ్యతని అన్నారు. దేవుడి పేరుతో సాగించిన ఈ పెద్ద స్కాంపై బీజేపీ తక్షణమే స్పందించాలని, దేశ ప్రజలందరికీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తి ముసుగులో రాజకీయ వ్యాపారం చేసే శక్తులను ప్రజలు ఇకనైనా గుర్తించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం.. స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాలకు ప్రతీకగా ఈ ప్రత్యేక ఆతిథ్యాన్ని భావిస్తున్నారు.భారత ప్రధాని ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్ చేశాయి. జకార్తా విమానాశ్రయంలో సంప్రదాయ ఇండోనేషియా నృత్య ప్రదర్శనలతో మోదీకి ఆత్మీయ స్వాగతం లభించింది.ఈ పర్యటనలో మోదీ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్–ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, సముద్ర భద్రత, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించనున్నారు.పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో 2018లో భారత్–ఇండోనేషియా సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేశామని మోదీ గుర్తు చేశారు. ఈ భాగస్వామ్యం తర్వాత తన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదేనని పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రబోవో పర్యటనకు కొనసాగింపుగానే ఈ భేటీ జరుగుతోందని తెలిపారు.ఇండోనేషియాలోని భారతీయ ప్రవాసులతో మోదీ సమావేశం కానున్నారు. అలాగే ప్రబోవోతో కలిసి యోగ్యకర్తలోని ప్రసిద్ధ ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఈ ఆలయం భారత్–ఇండోనేషియా సాంస్కృతిక బంధానికి ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో సహకారం మరింత బలపడింది. బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, సైనిక శిక్షణ, రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం విస్తరిస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత్–ఇండోనేషియా ద్వైపాక్షిక వాణిజ్యం 24.78 బిలియన్ డాలర్లకు చేరగా, 130కి పైగా భారత కంపెనీలు ఇండోనేషియాలో పెట్టుబడులు పెట్టాయి.ఇండోనేషియా పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్నారు.

## ప్రపంచంలోనే అత్యంత అందమైన ఎయిర్‌పోర్టులు... జాబితాలో రెండు భారత విమానాశ్రయాలు

**ప్రపంచంలోని అత్యంత అందమైన ఎయిర్‌పోర్టుల జాబితా విడుదల**

**ప్రిక్స్ వెర్సైల్స్ 2026 జాబితాలో రెండు భారత విమానాశ్రయాలు**

**గౌహతి, నవీ ముంబై ఎయిర్‌పోర్టులకు దక్కిన అరుదైన గౌరవం**

**ఆధునిక డిజైన్, సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ గుర్తింపు**

భారత విమానయాన రంగం అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటింది. దేశంలోని రెండు విమానాశ్రయాలు ప్రపంచంలోనే అత్యంత అందమైన ఎయిర్‌పోర్టుల జాబితాలో స్థానం సంపాదించుకున్నాయి. గౌహతిలోని లోక్‌ప్రియ గోపీనాథ్ బొర్దొలొయ్ అంతర్జాతీయ విమానాశ్రయం (టెర్మినల్–2), నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం (టెర్మినల్–1) ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నాయి. ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఆర్కిటెక్చర్, డిజైన్ అవార్డు అయిన 'ప్రిక్స్ వెర్సైల్స్ 2026' తాజాగా ఈ జాబితాను విడుదల చేసింది.పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ప్రకటించే ఈ పురస్కారం, ప్రపంచవ్యాప్తంగా కొత్తగా నిర్మించిన లేదా ఆధునికీకరించిన విమానాశ్రయాలను గుర్తిస్తుంది. ఆధునిక డిజైన్, పర్యావరణ హిత నిర్మాణం, సాంస్కృతిక గుర్తింపు, ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందించే అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ ఎంపిక చేపడతారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఏడు విమానాశ్రయాలు ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో చోటు దక్కించుకున్నాయి.గౌహతిలోని టెర్మినల్–2ను ఈశాన్య భారతానికి ప్రత్యేకమైన 'వెదురు ఆర్కిడ్' పుష్పాల స్ఫూర్తితో నిర్మించారు. టెర్మినల్ లోపల 'ఇండోర్ స్కై ఫారెస్ట్', అస్సామీ సంప్రదాయ హస్తకళల మేళవింపుతో దీనికి రూపకల్పన చేశారు. ఇక, అదానీ గ్రూప్ ఆధ్వర్యంలోని నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్–1ను 'కమలం' ఆకృతిలో నిర్మించారు. సహజ సిద్ధమైన వెలుతురు, గాలి ప్రసరణకు పెద్దపీట వేస్తూ, ఇంధన వినియోగాన్ని తగ్గించేలా దీన్ని అద్భుతంగా డిజైన్ చేశారు. ఈ జాబితాలో భారత్‌తో పాటు చైనాలోని గ్వాంగ్‌జౌ, జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్, అమెరికాలోని పిట్స్‌బర్గ్, శాన్ డియాగో విమానాశ్రయాలు కూడా ఉన్నాయి. విమానాశ్రయాలను కేవలం రవాణా కేంద్రాలుగానే కాకుండా, అద్భుతమైన సాంస్కృతిక చిహ్నాలుగా తీర్చిదిద్దడంలో భారత్ అగ్రగామిగా నిలుస్తోందని ఈ అంతర్జాతీయ గుర్తింపు చాటిచెబుతోంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

జూలై । మంగళవారం । 7 । 2026



# తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులకు తొలి ప్రాధాన్యతతో పెన్షన్లు--ఉచిత బస్ పాసులు ఇవ్వాలి: తలసేమియా వెల్ఫేర్ సొసైటీ





**మనదునియా,మంచిర్యాల;జూలై 6:**

తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా వంటి తీవ్ర రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని ప్రత్యేక కేటగిరీగా పరిగణించి, మొదటి ప్రాధాన్యతతో వికలాంగుల పెన్షన్లు మరియు ఉచిత బస్ పాసులు మంజూరు చేయాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.సోమవారం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గుర్తించిన 21 రకాల వైకల్యాల పరిధిలో తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులు కూడా ఉన్నందున, వీరికి కొత్తగా మంజూరు చేయనున్న వికలాంగుల పెన్షన్లలో తొలి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించిన రెండు లక్షల కొత్త వికలాంగుల పెన్షన్ల హామీని వెంటనే అమలు చేయాలని కోరారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలసేమియా, కిడ్నీ డయాలసిస్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10,000 పెన్షన్ అందిస్తున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం కూడా అదే తరహాలో తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులకు నెలకు రూ.10,000 చొప్పున ప్రత్యేక పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ వ్యాధులతో బాధపడుతున్న కుటుంబాలు ప్రతి నెల రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వైద్య ఖర్చులు భరించాల్సి వస్తోందని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. జీవితాంతం రక్త మార్పిడి, మందులు, వైద్య పరీక్షలు అవసరమయ్యే ఈ వ్యాధుల చికిత్స భారాన్ని ప్రభుత్వం తగ్గించాలని కోరారు.అలాగే, రక్త మార్పిడి, వైద్య పరీక్షల కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్‌లోని ప్రత్యేక ఆసుపత్రులకు తరచూ ప్రయాణించాల్సి వస్తున్నందున, కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు 21 రకాల వైకల్యాలు ఉన్న బాధితులకు ఉచిత బస్ పాసులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రయాణ సౌకర్యం కల్పిస్తేనే బాధితులు సకాలంలో వైద్యం పొందగలరని పేర్కొన్నారు.ఈ సమావేశంలో తలసేమియా, సికిల్ సెల్ బాధితుల తల్లిదండ్రులు ఇసంపెల్లి సత్యనారాయణ, మడావి ధర్మేందర్, ఈశ్వరోజ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# ఊరి మేలు కోసం పోరాడితే కుట్రలా..?

- బెల్ట్ షాపులు ఎట్టి పరిస్థితుల్లో నడవనివ్వం, 12వ వార్డు సభ్యురాలు ఒస్కుల కీర్తన

**మన దునియా -- కమలాపూర్**




కమలాపూర్ గ్రామంలో బెల్ట్ షాపుల నిర్మూలన కోసం గ్రామపంచాయతీ తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకునేందుకు కొందరు కుట్రలకు పాల్పడుతున్నారని 12వ వార్డు సభ్యురాలు ఒస్కుల కీర్తన ఆరోపించారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ మద్యం విక్రయాల వల్ల మహిళలు, యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ మహిళల విజ్ఞప్తి మేరకు బెల్ట్ షాపులను నిషేధిస్తూ గ్రామపంచాయతీ పాలకమండలి తీర్మానం చేసిందన్నారు.గ్రామపంచాయతీ నిర్ణయాన్ని గౌరవించాలని పలుమార్లు కోరినా కొందరు అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగించారని తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు, అబ్కారీ శాఖ అధికారులకు తెలియజేసినా స్పందన లేకపోవడంతో పాలకమండలి సభ్యులు, యువకులు కలిసి తనిఖీ చేయగా అక్రమ మద్యం విక్రయాలు బయటపడ్డాయని చెప్పారు.గ్రామ ప్రయోజనాల కోసం ప్రశ్నించినందుకే సర్పంచ్, వార్డు సభ్యులు, యువకులపై తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని కీర్తన ఆరోపించారు. గ్రామపంచాయతీ పాలకమండలిపై అసత్య ప్రచారం చేస్తూ దుష్ప్రచారానికి పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్ని కుట్రలు, బెదిరింపులు వచ్చినా కమలాపూర్‌లో బెల్ట్ షాపులు కొనసాగనివ్వబోమని స్పష్టం చేసిన ఆమె, పాలకమండలి సభ్యులపై కేసులు నమోదు చేస్తే మహిళలు పెద్దఎత్తున ఉద్యమానికి దిగుతారని హెచ్చరించారు. గ్రామాభివృద్ధి, మహిళల భద్రత కోసం చేపట్టిన ఈ చర్యకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# కృష్ణాపురం గ్రామ శివారులో ఎన్ హెచ్ 163 జాతీయ రహదారిపై వెహికల్ చెకింగ్ చేస్తున్న పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్

**మన దునియా, వాజేడు, జూలై 6**





ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామ శివారులో 163 జాతీయ రహదారిపై పేరూరుఎస్సై కృష్ణ ప్రసాద్ వారి సిబ్బందితో వెహికల్ చెకింగ్ నిర్వహించి మోటార్ సైకిల్ పై వెళ్లేవారు హెల్మెంట్ కంపల్సరీ డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ పొల్యూషన్ కూడా కంపల్సరిగా ఉండాలని అన్నారు నిషేధిత గంజాయి గుడుంబా వంటి విక్రయాలు సేవించె వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారిపై కఠినమైన కేసులు కూడా పెడతామని హెచ్చరించారు

# నాంపల్లి క్రిమినల్ కోర్టులో అగ్నిప్రమాదం

**మన దునియా,హైదరాబాద్:జులై 06**



హైదరాబాద్‌లోని నాంపల్లి క్రిమినల్ కోర్టులో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది, కోర్టు భవనం మూడో అంతస్తులో ఒక్కసారిగా మంట లు చెలరేగాయి. ఇది గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపు లోకి తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి, ఇతర అంతస్తులకు మంట లు వ్యాపించకుండా అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పిందని అధి కారులు తెలిపారు. కాగా, షార్ట్‌సర్క్యూ ట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభ వించి ఉంటుందని ప్రాథమికంగా అం చనా వేస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, పరిస్థితి పూర్తిగా అదుపు లోనే ఉందని అధికారులు వెల్లడించారు.ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఆస్తి నష్టం ఎంతమేరకు జరిగిందనే అంశా లపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఏపీ లో ఐపీఎస్ అధికారుల బదిలీలు!

**మన దునియా,అమరావతి:జూలై 06**




ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం పాలనపరమైన కారణాలతో కొంతమంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది, పాలన అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఐపీఎస్ అధికారులను తక్షణమే బదిలీలు కొత్త పోస్టింగులు కల్పిస్తూ.. సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది, మార్కాపూర్ జిల్లా ఓఎస్డీ అడ్మినిస్ట్రేషన్ నవ్ జ్యోతి మిశ్రాను నియమించారు. తూర్పుగోదావరి రాజమండ్రి అదనపు ఎస్పీ అడ్మిన్‌గా పాటిల్ దేవ్ రాజ్ మనీష్‌ను బదిలీ చేశారు. అలాగే మండా జావలి అల్ఫోన్స్‌ను పోల వరం జిల్లా ఓఎస్డీగా నియమించారు. అమరావతి ఓఎస్డీ లా అండ్ ఆర్డర్‌గా మనోజ్ రామనాథ్ హెగ్డేను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు లు ఇచ్చింది. రోహిత్ కుమార్ చౌదరికి పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల అసిస్టెంట్ సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఏఎస్పీ,సుస్మితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేసింది. పరిపాలనా అవస రాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టి నట్లు అధికార వర్గా లు వెల్లడించాయి.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు నేడు విచారణ

**హీరో అల్లు అర్జున్ నేరుగా విచారణకు హాజరవుతారా?**

**మన దునియా,హైదరాబాద్:జులై 06**



హైదరాబాద్‌లో సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసుకు సంబంధించి సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరగనుంది, నింది తులు అందరూ విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది ఈ క్రమంలో అల్లు అర్జున్, నేరు గా హాజరవుతారా? అనే సస్పెన్స్ కొనసాగుతుంది. కేసుకు సంబంధిం చి నిందితులందరూ కోర్టుకు హాజరు కావాలని న్యాయ స్థానం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. గత విచా రణ సందర్భంగా ప్రముఖ నటుడు అల్లు అర్జున్ వర్చువల్ విధానం లో కోర్టు ముందు హాజర య్యారు. అయితే కేసులో ఉన్న ఇద్దరు నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడం తో విచారణను నాంపల్లి కోర్టు నేటికి వాయిదా వేసింది. ఈ కేసులో మొత్తం 23 మంది నిందితు లు ఉన్నారు. వారందరూ కోర్టుకు హాజరైన తర్వాతే తదుపరి విచారణ ప్రక్రియను కొనసాగించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో నేటి విచారణ కు ప్రాధాన్యత ఏర్పడింది. అల్లు అర్జున్ కూడా ఈరోజు జరిగే విచా రణకు ప్రత్యక్షంగా కాకుండా వర్చువల్ విధానంలోనే హాజర య్యే అవకాశం ఉంది. అయితే దీనిపై అధికారిక సమాచారం వెలువ డాల్సి ఉంది. దీనికి కారణం ప్రస్తుతం అల్లు అర్జున్ ముంబైలోనే ఉన్నట్లు తెలిసింది.

మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

# కొండగట్టు ఆలయంలో జేష్ఠాభిషేక వేడుకలు



**మన దునియా,జగిత్యాల జిల్లా: జులై 06**

జగిత్యాల జిల్లా మాల్యాల మండలం లోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో జ్యేష్ఠ మాసాన్ని పురస్క రించుకుని సోమ వారం జ్యేష్ఠాభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరాలయంలోని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చార ణల నడుమ స్వామివారికి పంచామృతాభిషేకంప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం పంచా మృత అభిషేకం నిర్వహించారు. స్వామివారిని 108 కలశాలలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తెలంగాణ నలుమూలల నుం చి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పా ల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ ఎస్. అంజనారెడ్డి ఆధ్వ ర్యంలో అధికారు లు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# రాజకీయ ప్రయోజనాల కోసమే కేటీఆర్ కన్నెపల్లి పర్యటన: శ్రీధర్‌బాబు

**మన దునియా,హైదరాబాద్:జులై 06**



రాజకీయ ప్రయోజనాల కోసమే కేటీఆర్ కన్నెపల్లి పర్యటన: శ్రీధర్‌బాబు తెలంగాణ : కన్నెపల్లి పర్యనటతో కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించారని మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. కేటీఆర్ కన్నెపల్లి పర్యటన రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్? కుటుంబం ముందుంటుందని ఎద్దేవా చేశారు. డ్యాం సేఫ్టీ అథారిటీ, సాంకేతిక నిపుణుల సూచనలతోనే మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు. బ్యారేజీల భద్రతలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు.

# 108 సేవలు మరోసారి ఆదర్శం.. అంబులెన్స్‌లో పండంటి ఆడ శిశువుకు జన్మ

ఖానాపూర్ ఆర్సి మన దునియా; జూలై 06:

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని సింగరాయిపేట గ్రామానికి చెందిన శ్రీలత (భర్త: నాగేశ్)కు అకస్మాత్తుగా పురిటి నొప్పులు రావడంతో ఆశా కార్యకర్త తిరుమలకు సమాచారం అందింది. ఆమె వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, అత్యవసర వైద్య సేవల సిబ్బంది వెంటనే గ్రామానికి చేరుకుని గర్భిణిని లక్సెట్టిపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)కు తరలించారు.ఆసుపత్రికి తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యలో ప్రసవ నొప్పులు తీవ్రంగా పెరగడంతో పరిస్థితిని గమనించిన 108 ఈఎంటీ రమేష్, పైలట్ రఫీక్ సమయస్ఫూర్తితో అంబులెన్స్‌లోనే సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. శ్రీలత పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది.అనంతరం తల్లీబిడ్డలను లక్సెట్టిపేట సీహెచ్‌సీకి తరలించి వైద్యుల పర్యవేక్షణలో చేర్పించారు. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా స్థానికులు 108 సిబ్బంది రమేష్, రఫీక్‌ల సేవలను అభినందిస్తూ, వారి సమయస్ఫూర్తి వల్ల తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని కొనియాడారు.



# బెస్ట్ విధ్యార్థుల నుంచి ఫీజు వసూలు చేస్తున్నవిజ్ఞాన్ స్కూల్లో పై చర్యలు తీసుకోవాలి.

**బెస్ట్ అవైలబుల్ విద్యార్థుల నుంచి ఫీజులు వసూళ్లు**

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన టీజీవీపీ**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

నిజామాబాద్ నగరంలోని విజ్ఞాన్ స్కూల్ పై చర్య లు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి పిర్యాదు చేశారు.బెస్ట్ అవైలెబుల్ పథకం లో విజ్ఞాన్ స్కూల్లో చదువుతున్న విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు ఆరోపణలు ఉన్న అక్రమాలు పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి పరిషత్ టౌన్ ప్రెసిడెంట్ సుంకోజి అఖిల్ మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారు, ప్రభుత్వం ఉచితంగా అందించాల్సిన షూస్, పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి కూడా డబ్బులు వసూలు చేస్తున్నారని పించారు.అలాగే విద్యార్థులు పయోగించాల్సిన నోట్బుక్స్ ను స్కూల్‌యాజమాన్యమే అధిక ధరలకు విక్రయిస్తూ, వారికి ఎలాంటి రసీదులు ఇవ్వకుండా విక్రయిస్తున్నారని, వాటిని తప్పనిసరిగా కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారని తెలిపారు.ఈ అంశాలపై సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత యాజమాన్యంపై చట్టపరమైన, శాఖాపరమైన



కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి విద్యార్థికి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వారి తల్లిదండ్రుల పై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హేమంత్ అంకుష్ రోహన్ తదితరులు పాల్గొన్నారు.

# చెరుకూరు అటవీ ప్రాంతంలో ఎన్ హెచ్ 163 జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా కొట్టిన బొలెరో వాహనం





**డ్రైవర్ కు స్వల్ప గాయాలు ప్రాణాపాయం తప్పింది**

**మన దునియ, వాజేడు, జులై 6**

ములుగు జిల్లా వాజేడు మండలం చెరుకూరు గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఎన్ హెచ్ 163 జాతీయ రహదారిపై డ్రైవర్ రాత్రి సమయంలో నిద్రమత్తులో సడన్గా బ్రేక్ కొట్టడం వలన అదుపుతప్పి పల్టీ కొట్టినది అందులో ఉన్న కీరదోస ప్యాకెట్స్ చెల్లాచెదురుగా పడిపోయినవి ఉదయం సుమారు 9 గంటల సమయంలో మరొక వాహనంలో లోడ్ చేసుకొని వెళ్లారని తెలిసింది డ్రైవరు క్లీనర్ ప్రాణా ప్రాయస్థితిలో నుండి బయటకు రావడం జరిగిందని ప్రాథమిక సమాచరం ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది



# తప్పుడు ప్రచారాలపై చట్టపోరాటం.. ఎస్పీని ఆశ్రయించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్

**కొన్ని పత్రికలు, బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు కోరుతూ ఫిర్యాదు**

**మన దునియా,ములుగు:జూలై 06**

రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమే. అయితే అవి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించే స్థాయికి చేరితే చట్టాన్ని ఆశ్రయించడం తప్ప మరో మార్గం ఉండదని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అభిప్రాయపడుతున్నారు.తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు, అవాస్తవ ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ ఆయన సోమవారం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేఖన్‌ను కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎస్పీ కార్యాలయానికి వెళ్లిన ఆయన, కొన్ని వార్తాపత్రికలు, సోషల్ మీడియా వేదికల ద్వారా తన ఫొటోతో నిరాధార కథనాలు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఫిర్యాదులో కాకతీయ, నిత్యం నిఘా, స్పాట్ వాయిస్, నవతెలంగాణ (దయాసాగర్) పేర్లతో పాటు బీఆర్ఎస్ నేతలు మన్నే క్రిషాంక్, అంబటి శశిధర్ రెడ్డిల పేర్లను కూడా ప్రస్తావిస్తూ, తమపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.పైడాకుల అశోక్ ప్రకారం, ఈ ప్రచారం వల్ల తన వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు రాజకీయ జీవితానికీ నష్టం కలుగుతోందని, అందువల్ల సంబంధిత అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని పోలీసులను కోరారు.ఈ పరిణామంతో ములుగు జిల్లా రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం చర్చనీయాంశంగా మారింది. అయితే ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు లేదా సంస్థల స్పందన ఇంకా వెలువడాల్సి ఉంది. అలాగే ఈ ఫిర్యాదుపై పోలీసులు చేపట్టే విచారణ, తదుపరి చర్యలు ఎలా ఉంటాయనే అంశం కూడా ఆసక్తిగా మారింది.రాజకీయ విమర్శలు వాస్తవాధారాలపై ఉండాలా? లేక వ్యక్తిగత ఆరోపణల వరకు వెళ్లాలా? అనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వివాదానికి పోలీసుల విచారణ ఎలాంటి ముగింపు ఇస్తుందో వేచి చూడాల్సి ఉంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జూలై । మంగళవారం । 7 । 2026
జనరల్ న్యూస్ 05

# పోలీస్ నియామకాలపై నిరుద్యోగుల శాంతియుత ర్యాలీ








**నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

సామాజిక తెలంగాణ ఫ్రంట్ ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాల భర్తీ, ఖాళీల పెంపు, వయోపరిమితి సడలింపు వంటి డిమాండ్లతో సోమవారం నిజామాబాద్లో నిరుద్యోగ యువత శాంతియుత ర్యాలీ నిర్వహించారు. నిజామాబాద్ సెంట్రల్ లైబ్రరీ నుంచి కలెక్టరేట్ వరకు నడక మార్గంలో ర్యాలీ చేపట్టి, అనంతరం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 5,000 పోలీస్ ఖాళీలను వెంటనే 20,000కు పెంచి భర్తీ చేయాలని వారు కోరారు.అదే విధంగా కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్-ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా సిదమవుతున్న నిరుద్యోగులకు వయోపరిమితి పెంపు ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ, తమ డిమాండ్లను ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలించి అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని పోలీస్ నియామకాల సంఖ్యను పెంచడంతో పాటు వయోపరిమితిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# గుండెపోటుకు గురికాకూడదనుకునే వారు వీటిని అలవాటు చేసుకోవాల్సిందే

ప్రస్తుత రోజుల్లో గుండెపోటు అనేది సర్వసాధారణమైపోయింది. ఇంతకుముందు ఈ సమస్య పెద్దవారిలో మాత్రమే కనిపించేది. కానీ, ఇప్పుడు యువత కూడా దీని బారిన పడుతున్నారు. ఎవరైనా డ్యాన్స్ చేస్తున్నప్పుడు, లేదా ఏదైనా పనిచేస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా పడిపోయారని మీరు తరచుగా వినే ఉంటారు. అలాంటి వారు కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తారు. వీటన్నింటికీ ప్రధాన కారణం ధమనులలో ఫలకం అడ్డుపడటం. దీని కారణంగా రక్తం గుండెకు చేరదు. శరీరంలో ఆక్సిజన్ కొరత ఉంటుంది. ఈ పరిస్థితిలో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నింటినీ నివారించడానికి, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు అవసరం. అందుకోసం ఈ అలవాట్లను అలవాటు చేసుకోండి. కొలెస్ట్రాల్ లేదా ఫలకం ధమనులను అడ్డుకోవడం వల్ల గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడానికి అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన ఆహారం. ఈ పరిస్థితిలో, మీరు గుండె సంబంధిత సమస్యలను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి అనారోగ్యకరమైన ఆహారం లేదా ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాన్ని తినడం మానేయండి. వాటికి బదులుగా పచ్చి ఆకు కూరలు, పప్పులు, తృణధాన్యాలు, తాజా పండ్లు, గుడ్లు వంటి తాజా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినండి. ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి, మీరు రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలి. దీని కోసం ప్రతిరోజూ సైకిల్, ఈత, పరుగు, నడక, శక్తి శిక్షణ చేయండి. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే హాని చేస్తుందని అనుకుంటే అది తప్పు. అది గుండెకు కూడా హాని చేస్తుంది. సిగరెట్ పొగ నుండి విడుదలయ్యే రసాయనాలు ధమనులలో పొరను ఏర్పరుస్తాయి. దీని వలన ధమనులు నిరోధించబడతాయి. ఈ రోజుల్లో, ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతోంది. ఇది ధమనులలో వాపును కలిగిస్తుంది. దీని వలన ధమనులు ఉబ్బడం అలాగే నిరోధించబడతాయి. ఒత్తిడి కారణంగా శరీరంలో 1500 రసాయనాలు విడుదలవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ పరిస్థితిలో, ఒత్తిడిని నియంత్రించడానికి ప్రశాంతంగా ఉండండి. కోపం తెచ్చుకోకండి. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయండి. మీరు మీ హృదయాన్ని ప్రేమిస్తే మద్యానికి దూరంగా ఉండండి. ఆల్కహాల్ కొలెస్ట్రాల్, రక్తపోటు రెండింటినీ పెంచుతుంది. కాబట్టి, గుండె ఆరోగ్యంగా ఉండటానికి దాని వినియోగాన్ని నివారించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి. అధిక బరువు కొలెస్ట్రాల్, అధిక రక్తం, అధిక షుగర్కి అతి పెద్ద కారణంగా పరిగణించబడుతుంది. కాబట్టి దానిని అదుపులో ఉంచండి. దీని కోసం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.



# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

## హోంగార్డ్ గట్టక్క మృతి పట్ల పోలీసుల సంతాపం

**మన దునియా, జులై 06,మంచిర్యాల జిల్లా**




మందమర్రి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ గట్టక్క, అనారోగ్య కారణంతో అకాల మరణం చెందారు. ఆమె మరణం పోలీస్ శాఖకు తీరని లోటు అని సహచర సిబ్బంది పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో మందమర్రి సిఐ పర్స రమేష్ స్థానిక , ఏఎస్సైలు మాజీద్ ఖాన్ మరియు మిలన్ గట్టక్క నివాసానికి చేరుకున్నారు. వారు ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ పర్స రమేష్ ఇతర పోలీస్ అధికారులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె సేవలను కొనియాడుతూ, ఈ కష్టకాలంలో కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హోంగార్డ్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?

ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్టాప్ లేదా మొబైల్పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్టాప్ లేదా మొబైల్పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎస్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్గా కూడా పనిచేస్తుంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జూలై । మంగళవారం । 7 । 2026



# తండ్రికి తగ్గ తనయుడు.. శ్రీలంకపై అన్వయ్ ద్రవిడ్ మెరుపు ఇన్నింగ్స్.. త్రుటిలో సెంచరీ మిస్!

**శ్రీలంకతో రెండో యూత్ వన్డేలో రాణించిన అన్వయ్ ద్రవిడ్**

**కేవలం 67 బంతుల్లో 87 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్**

**అర్జున్ రాజ్‌పుత్‌తో కలిసి 145 పరుగుల కీలక భాగస్వామ్యం**

**చివర్లో తడబాటుతో 285 పరుగులకు ఆలౌటైన భారత జట్టు**

**ఐదు వికెట్లతో రాణించిన లంక బౌలర్ గిమ్హాన్ మెండిస్**



భారత క్రికెట్ దిగ్గజం, 'ది వాల్' రాహుల్ ద్రవిడ్ క్రికెట్ వారసత్వాన్ని ఆయన చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ ఘనంగా ముందుకు తీసుకెళుతున్నాడు. శ్రీలంక అండర్-19 జట్టుతో నేడు జరిగిన రెండో యూత్ వన్డేలో ఈ యువ వికెట్ కీపర్-బ్యాటర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. మహింద రాజపక్స అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కేవలం 67 బంతుల్లోనే 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 87 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 19వ ఓవర్ ముగిసేసరికి 81 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్, మరో బ్యాటర్ అర్జున్ రాజ్‌పుత్ (76 పరుగులు) తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 145 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. ముఖ్యంగా అన్వయ్ దూకుడుగా ఆడుతూ కేవలం 47 బంతుల్లోనే తన తొలి యూత్ వన్డే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని దూకుడు చూసి శతకం ఖాయమనిపించినా, శ్రీలంక లెఫ్ట్ ఆర్మ్ పేసర్ గిమ్హాన్ మెండిస్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. 129.85 స్ట్రైక్ రేట్‌తో ఆడిన అన్వయ్ ఇన్నింగ్స్ జట్టు స్కోరును పరుగులు పెట్టించింది. అర్జున్ రాజ్‌పుత్ కూడా 81 బంతుల్లో 76 పరుగులు చేసి రాణించాడు. అయితే, దిమంత మహవితాన అద్భుతమైన త్రోకు అతను రనౌట్‌గా వెనుదిరిగాడు. కీలక భాగస్వామ్యం విడిపోయిన తర్వాత భారత ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. 263 పరుగుల వద్ద ఏడో వికెట్‌గా అన్వయ్ ఔటైన తర్వాత, భారత టెయిలెండర్లు చేతులెత్తేశారు. కేవలం 22 పరుగుల వ్యవధిలో చివరి మూడు వికెట్లు కోల్పోయి 47.2 ఓవర్లలో 285 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో గిమ్హాన్ మెండిస్ 41 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి భారత్‌ను కట్టడి చేశాడు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉంది. తొలి మ్యాచ్‌లో 321 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇటీవల వినూ మన్కడ్ ట్రోఫీలో కర్ణాటక జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అన్వయ్, ఆ టోర్నీలో 220 పరుగులు చేసి మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఈ ప్రదర్శనతో రాబోయే అండర్-19 ప్రపంచ కప్‌కు ఎంపికయ్యే అవకాశాలను మరింత మెరుగుపరుచుకున్నాడు. కాగా, అన్వయ్ అన్నయ్య సమిత్ ద్రవిడ్ కూడా ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపికైనా మోకాలి గాయం కారణంగా దూరమయ్యాడు.

# ఒక రెడ్ కార్డ్.. ఒక ఫోన్ కాల్.. ఫిఫా వరల్డ్ కప్‌లో ట్రంప్ జోక్యంపై దుమారం!

బెల్జియంతో కీలక నాకౌట్ మ్యాచ్‌కు అందుబాటులోకి స్టార్ స్ట్రైకర్ బలోగన్

ప్రస్తుతం జరుగుతున్న ఫిఫా ప్రపంచకప్ 2026 ఒక అనూహ్య రాజకీయ వివాదంలో చిక్కుకుంది. అమెరికా జాతీయ జట్టు ఆటగాడు ఫోలరిన్ బలోగన్‌పై విధించిన రెడ్ కార్డ్, సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేరుగా ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినోతో ఫోన్‌లో మాట్లాడటం క్రీడా వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఈ ఉన్నతస్థాయి జోక్యం తర్వాత ఫిఫా క్రమశిక్షణా కమిటీ బలోగన్ సస్పెన్షన్‌ను రద్దు చేయడంతో ఈ వివాదం మరింత ముదిరింది.

అసలేం జరిగింది?

ప్రపంచకప్ గ్రూప్ స్టేజ్‌లో బోస్నియా అండ్ హెర్జెగోవినాతో జరిగిన చివరి మ్యాచ్‌లో అమెరికా 2-0తో గెలిచింది. అయితే, ఈ మ్యాచ్ 64వ నిమిషంలో అమెరికా స్టార్ స్ట్రైకర్ బలోగన్‌కు రిఫరీ రెడ్ కార్డ్ చూపించారు. నిబంధనల ప్రకారం అతను తదుపరి మ్యాచ్‌కు దూరమవ్వాలి. దీంతో బెల్జియంతో జరగనున్న కీలకమైన రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌కు బలోగన్ దూరం కానున్నాడని భావించారు. అయితే, అనూహ్యంగా ట్రంప్ రంగంలోకి దిగారు. ఫిఫా అధ్యక్షుడు ఇన్ఫాంటినోకు ఫోన్ చేసి, రెడ్ కార్డ్ నిర్ణయం, సస్పెన్షన్ వెనుక ఉన్న కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంభాషణ జరిగిన కాసేపటికే, అమెరికా ప్రభుత్వం అందించిన అదనపు ఆధారాలతో స్వతంత్ర అప్పీల్ బోర్డు సస్పెన్షన్‌ను రద్దు చేసింది. "అధ్యక్షుడు, ఇన్ఫాంటినో మాట్లాడుకున్నారు. రెడ్ కార్డ్ ఎందుకు ఇచ్చారో, సస్పెన్షన్ ఎందుకు విధించారో అధ్యక్షుడు తెలుసుకోవాలనుకున్నారు. చివరికి సరైన ఫలితం వచ్చింది" అని ఒక అమెరికన్ అధికారి ధ్రువీకరించారు.

ఫిఫా అసాధారణ నిర్ణయం


ఫిఫా క్రమశిక్షణా కమిటీ కూడా అసాధారణమైన రీతిలో ఒక ప్రకటన విడుదల చేసింది. బలోగన్‌పై విధించిన ఆటోమేటిక్ మ్యాచ్ సస్పెన్షన్‌ను ఏడాది పాటు ప్రొబేషనరీ పీరియడ్‌కు లోబడి నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అంటే.. అతను వెంటనే మ్యాచ్ ఆడేందుకు అర్హత సాధించాడు. ఈ నిర్ణయం వెలువడగానే ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో "సరైన నిర్ణయం తీసుకుని, జరిగిన అన్యాయాన్ని సరిదిద్దినందుకు ఫిఫాకు ధన్యవాదాలు" అని పోస్ట్ చేశాడు.

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న యూరప్ దేశాలు

ఈ నిర్ణయంపై బెల్జియం, నార్వే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఫిఫా తన సొంత నిబంధనలనే ఉల్లంఘించిందని బెల్జియం ఫుట్‌బాల్ సమాఖ్య ఆరోపించింది. అందుబాటులో ఉన్న అన్ని చట్టపరమైన అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. మరోవైపు నార్వే మేనేజర్ స్టాలే సోల్బాకెన్ ఫిఫా నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. "ఇది ఫిఫా చేసిన పెద్ద తప్పు. ఆటగాడికి రెడ్ కార్డ్ ఇచ్చారు. వీఏఆర్ కూడా దానిని ధ్రువీకరించింది. అలాంటప్పుడు సస్పెన్షన్ సహజం. రాజకీయ నాయకుల జోక్యంతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే, అది ఆటకే ప్రమాదకరం. భవిష్యత్తులో ఇచ్చే ప్రతి రెడ్ కార్డ్‌కు ఇలాగే కమిటీలు వేసి నిర్ణయాలు మారుస్తారా? ఇది చాలా చెడ్డ నిర్ణయం" అని ఆయన మండిపడ్డారు. ఈ వివాదం కారణంగా అమెరికా టోర్నమెంట్‌లో ఎంత ముందుకు వెళ్లినా, వారిపై ఈ మచ్చ అలాగే ఉండిపోతుందని వ్యాఖ్యానించారు. ఈ వివాదం ఎలా ఉన్నా, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌కు ముందు స్టార్ స్ట్రైకర్ బలోగన్ తిరిగి జట్టులోకి రావడం అమెరికాకు భారీ ఊరటనిచ్చింది. ఈ టోర్నీలో ఇప్పటికే మూడు గోల్స్ చేసిన బలోగన్, బెల్జియంతో మ్యాచ్‌లో కీలకం కానున్నాడు. 2014 ప్రపంచకప్‌లో ఇదే రౌండ్ ఆఫ్ 16లో బెల్జియం చేతిలో ఓడిపోయిన అమెరికా, ఈసారి ఎలాగైనా గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది.



# ఇంగ్లండ్ తో వన్డే సిరీస్... నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో శివమ్ దూబే



ఇంగ్లండ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు భారత జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. గాయం కారణంగా జట్టుకు దూరమైన యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో సీమ్-బౌలింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబేను ఎంపిక చేసినట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించింది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సోమవారం ధ్రువీకరించారు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో నితీశ్ రెడ్డి తొడ కండరాల గాయానికి గురయ్యాడని, అతను ఇంకా పూర్తిగా కోలుకోనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం టీ20 సిరీస్ కోసం ఇంగ్లండ్‌లోనే ఉన్న శివమ్ దూబే, వన్డే సిరీస్ కోసం అక్కడే జట్టుతో కొనసాగుతాడని సైకియా వివరించారు. ఈ గాయం కారణంగానే నితీశ్ రెడ్డి ఐర్లాండ్, ఇంగ్లండ్ టీ20 సిరీస్‌లతో పాటు, జరగబోయే జింబాబ్వే పర్యటనకు కూడా దూరమయ్యాడు. రెండుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడైన దూబే, ఇప్పటివరకు 4 వన్డేలు ఆడాడు. భారత్, ఇంగ్లండ్ మధ్య వన్డే సిరీస్ జూలై 14న బర్మింగ్‌హామ్‌లో ప్రారంభం కానుంది. ఆ తర్వాత జూలై 16న కార్డిఫ్‌లో, జూలై 19న లార్డ్స్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సిరీస్ ముగిసిన తర్వాత దూబే నేరుగా జింబాబ్వే పర్యటనకు వెళ్లనున్నాడు.

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్-కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, శివమ్ దూబే.

# ఇదే నా చివరి ప్రపంచకప్.. క్రిస్టియానో రొనాల్డో కీలక ప్రకటన

పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌పై ఒక కీలక ప్రకటన చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంటే తన కెరీర్‌లో చివరిదని ఆయన స్పష్టం చేశాడు. స్పెయిన్‌తో జరగనున్న రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌కు ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తన భవిష్యత్తు ప్రణాళికలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించాడు. ఈ సందర్భంగా రొనాల్డో మాట్లాడుతూ.. "ఈ ప్రపంచకప్‌ను వీలైనంత ఎక్కువగా ఆస్వాదించాలనుకుంటున్నాను. ఎందుకంటే ఇదే నా చివరి ప్రపంచకప్. అయితే, రేపటి మ్యాచే ఈ టోర్నీలో నా చివరి గేమ్ కాకూడదని ఆశిస్తున్నాను" అన్నాడు. 41 ఏళ్ల రొనాల్డోకు ఇది ఆరో ప్రపంచకప్ కావడం విశేషం. ఈ టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడి మూడు గోల్స్ సాధించాడు. వీటిలో ఒకటి నాకౌట్ దశలో చేసినదే. తన సుదీర్ఘ కెరీర్‌లో ప్రపంచకప్‌లలో మొత్తం 11 గోల్స్ నమోదు చేశాడు. రిటైర్మెంట్‌పై పదేపదే ప్రశ్నలు అడగవద్దని మీడియాను కోరాడు. "నేను ఎప్పుడు రిటైర్ అవ్వాలనుకుంటే అప్పుడే అవుతాను. మీరు కోరుకున్నప్పుడు కాదు. ఈ ప్రశ్న అడగడం సమయం వృథా. నా దృష్టి మొత్తం రేపటి మ్యాచ్‌పైనే ఉంది" అని స్పష్టం చేశాడు. జట్టు పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, "జట్టుకు సహాయం చేయడానికి నేను ఎప్పుడూ నా శరీరం, ఆత్మతో కట్టుబడి ఉంటాను. నేను ఆడుతున్నానా? లేదా? అన్నది ముఖ్యం కాదు. నా పాత్ర ఎప్పుడూ కీలకమే" అని వివరించాడు. ఇది తన చివరి ప్రపంచకప్ అయినప్పటికీ, టోర్నీ గెలవాలనే లక్ష్యంతోనే పోర్చుగల్ జట్టు ఇక్కడికి వచ్చిందని రొనాల్డో ధీమా వ్యక్తం చేశాడు. "ప్రపంచకప్ గెలవగలమనే నమ్మకం లేకపోతే మేము ఇక్కడ ఉండేవాళ్లం కాదు. ఇది ఒక అందమైన అనుభవం. ప్రతీ గేమ్‌లోనూ మా ఆటను మెరుగుపరుచుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని పెద్ద జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. మా జట్టు చాలా ప్రశాంతంగా ఉంది, మేము బాగా శిక్షణ పొంది, మ్యాచ్‌కు సిద్ధమయ్యాం" అని అన్నాడు. మొత్తంగా ఈ ప్రపంచకప్‌తో తన ప్రస్థానానికి ముగింపు పలకనున్నప్పటికీ, జట్టును విజేతగా నిలపాలనే గట్టి పట్టుదలతో రొనాల్డో ఉన్నట్లు స్పష్టమవుతోంది



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ఏనుగు దంతాల కేసు: హైకోర్టు ముందుకు మోహన్‌లాల్ ఐటీ డిక్లేరేషన్ పత్రాలు



మలయాళ సూపర్ స్టార్, పద్మభూషణ్ మోహన్‌లాల్‌ను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ఏనుగు దంతాల అక్రమ నిల్వ కేసు కేరళ హైకోర్టులో సరికొత్త మలుపు తిరిగింది. గతంలో ఆయన ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన వాలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ నివేదిక ఇప్పుడు న్యాయస్థానం ముందుకు వచ్చింది. ఆ పత్రాల ప్రకారం... మోహన్‌లాల్ వద్ద కేవలం నాలుగు మాత్రమే కాకుండా, మొత్తం 10 ఏనుగు దంతాలతో పాటు దంతాలతో చేసిన మరో 13 కళాఖండాలు (విగ్రహాలు) ఉన్నాయి. ఈ వివరాలను ఆయన స్వయంగా వెల్లడించారు. 2011 జూన్ నెలలో మోహన్‌లాల్‌కు చెందిన ఇళ్లు, ఆఫీసులపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొచ్చిలోని ఆయన సొంత నివాసంలో నాలుగు ఏనుగు దంతాలు దొరికాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టాల ప్రకారం ముందస్తు అనుమతులు లేకుండా ఇలాంటి నిషేధిత వస్తువులను దగ్గర ఉంచుకోవడం నేరం కావడంతో కేరళ అటవీ అధికారులు నాడు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం గత పదేళ్లుగా కోర్టు పరిధిలోనే నలుగుతోంది. మరోవైపు, మోహన్‌లాల్ ఎలాంటి చట్టవిరుద్ధ పనులకు పాల్పడలేదని ఆయన తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు. ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన ప్రత్యేక 'ఐవరీ అమ్నెస్టీ' పథకం కింద ఈ సమాచారాన్ని ముందే డిక్లేర్ చేశామని కోర్టుకు వివరించారు. అయితే, ఐటీ శాఖకు వివరాలు అందజేసినప్పటికీ... అటవీ చట్టాల ప్రకారం ఈ దంతాలను కలిగి ఉండటానికి అవసరమైన అధికారిక యాజమాన్య ధ్రువీకరణ పత్రాన్ని మోహన్‌లాల్ సకాలంలో పొందారా? లేదా? అనే లీగల్ పాయింట్‌పైనే ప్రస్తుతం హైకోర్టులో ప్రధానంగా విచారణ సాగుతోంది.

## చిరంజీవి వ్యాఖ్యలపై రాజేంద్రప్రసాద్ స్పందన

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాన్ని ఇటీవలే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్న ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్, ఈ గౌరవంపై తన మనోభావాలను పంచుకున్నారు. అడిగి తీసుకుంటే అది 'భిక్ష' అవుతుందని, అడగకుండా ఇస్తేనే ఆ పురస్కారానికి అసలైన విలువ, గౌరవం ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. ఈ పురస్కారం తనకు ఆలస్యంగా లభించినప్పటికీ, దాని కోసం తాను ఎప్పుడూ పాకులాడలేదని రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. విజయ చాముండేశ్వరి బ్యానర్‌పై 'మేడమ్', 'రాంబంటు' వంటి చిత్రాలను నిర్మించినప్పటి అనుభవాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'రాంబంటు' సినిమా వల్ల వచ్చిన నష్టాల కారణంగా అన్నపూర్ణ స్టూడియోస్ సమీపంలోని తన అర ఎకరం భూమిని అమ్ముకోవాల్సి వచ్చిందని వివరించారు. తన నిర్మాణంలో వచ్చిన ఒక చిత్రంలోని మహిళా పాత్రకు ప్రత్యేక జ్యూరీ అవార్డు దక్కడం వెనక అక్కినేని నాగేశ్వరరావు ప్రోత్సాహం ఎంతో ఉందని స్మరించుకున్నారు. దక్షిణాది కళాకారులకు పురస్కారాలు ఆలస్యంగా వస్తున్నాయంటూ నటుడు చిరంజీవి చేసిన వ్యాఖ్యలపై రాజేంద్రప్రసాద్ ఆచితూచి స్పందించారు. "చిరంజీవి ఏ సందర్భంలో ఆ వ్యాఖ్యలు చేశారో నాకు తెలియదు. అయితే, ప్రతి విషయాన్ని ప్రతికూల కోణంలోనే చూడాల్సిన అవసరం లేదు" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఐదు తరాల నటీనటులతో కలిసి పనిచేయడం తన అదృష్టమని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఇప్పటితరం దర్శకులు సైతం తన కోసం ప్రత్యేకంగా పాత్రలను సృష్టిస్తుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తాను నటించిన ఆంగ్ల చిత్రం 'క్విక్ గన్ మురుగన్'కు సీక్వెల్ తీసే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు దశాబ్దాలుగా ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పద్మశ్రీ పురస్కారం లభించింది.




## హేమమాలిని 'డ్రీమ్ గాళ్' ఇలా అయ్యింది!



బాలీవుడ్ ఎవర్ గ్రీన్ బ్యూటీ, ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు హేమమాలినిని అభిమానులు ప్రేమగా 'డ్రీమ్ గాళ్' అని పిలుచుకుంటారు. అయితే, ఆమెకు ఆ పేరు ఎలా స్థిరపడిపోయిందో చాలా మందికి తెలియదు. ఈ బిరుదు వెనుక ఉన్న ఆసక్తికరమైన కథను ఆమె 'ది కపిల్ శర్మ షో'లో పంచుకున్నారు. తన సినిమా కంటే ముందే తనకు ఆ పేరు ఎలా వచ్చిందో వివరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. హేమమాలిని హిందీలో అడుగుపెట్టిన తొలి చిత్రం 'సప్నో కా సౌదాగర్' (1968). ఈ సినిమా నిర్మాత బి. అనంతస్వామి ఓ అద్భుతమైన ప్రచార వ్యూహంతో ముందుకు వచ్చారు. సినిమా విడుదల కాకముందు, హీరోయిన్ ఎవరో చెప్పకుండా "డ్రీమ్ గాళ్ వస్తోంది" (ణతీఋఎ +ఱతీశ్రీ ఎశీఎఱఅస్త్ర శీ శీఎఱ) అంటూ ముంబై అంతటా పోస్టర్లు వేయించారు. ఇది అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. ఆ డ్రీమ్ గాళ్ ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ విషయంపై హేమమాలిని మాట్లాడుతూ.. "నా తొలి సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. కానీ, పోస్టర్ల మీద ఎక్కడా నా పేరు కనిపించడం లేదు. అంతటా 'డ్రీమ్ గాళ్, డ్రీమ్ గాళ్' అనే కనిపిస్తోంది. వాళ్లేం చేస్తున్నారో అర్థం కాక నేను కాస్త ఆందోళన చెందాను. అప్పుడు నిర్మాత అనంతస్వామి గారు నాతో, 'నీ పేరును మేం ఇలాగే పరిచయం చేయబోతున్నాం. ఆ డ్రీమ్ గాళ్ ఎవరో కాదు, హేమమాలిని అని ఆ తర్వాత మేమే ప్రకటిస్తాం' అని చెప్పారు. ఆయన ఆలోచన అద్భుతంగా ఫలించింది. ఆ పేరు నాకు శాశ్వతంగా నిలిచిపోయింది" అని వివరించారు. మహేశ్ కౌల్ దర్శకత్వం వహించిన 'సప్నో కా సౌదాగర్' చిత్రంలో రాజ్ కపూర్, హేమమాలిని, తనూజ, నదిరా ప్రధాన పాత్రలు పోషించారు. శంకర్ జైకిషన్ అందించిన సంగీతం కూడా మంచి విజయం సాధించింది. ఆశ్చర్యకరంగా, ఈ బిరుదు వచ్చిన దాదాపు దశాబ్దం తర్వాత, 1977లో హేమమాలిని 'డ్రీమ్ గాళ్' పేరుతోనే వచ్చిన మరో సినిమాలో ప్రధాన పాత్రలో నటించారు. ప్రమోద్ చక్రవర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అశోక్ కుమార్, ధర్మేంద్ర, ప్రేమ్ చోప్రా వంటి అగ్ర తారలు ఉన్నారు. ఈ సినిమాలో హేమమాలిని అనాథ పిల్లల ఆశ్రమాన్ని నడపడం కోసం డబ్బు సంపాదించడానికి సప్న, పద్మ, చంపాబాయి, డ్రీమ్ గాళ్, రాజ్ కుమారి అనే ఐదు విభిన్న పాత్రలలో కనిపిస్తారు. లక్ష్మీకాంత్-ప్యారేలాల్ స్వరపరిచిన ఈ చిత్రంలోని "డ్రీమ్ గాళ్" పాటను కిశోర్ కుమార్ ఆలపించారు. ఈ పాట ఎవర్ గ్రీన్ హిట్ గా నిలిచి, హేమమాలిని 'డ్రీమ్ గాళ్' బిరుదును భారత సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలబెట్టింది.

## సింగ్ గీతం ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేస్తోంది!

సీనియర్ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందిన ప్రయోగాత్మక మ్యూజికల్ ఫాంటసీ చిత్రం 'సింగ్ గీతం' ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా జులై 9 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోపే ఈ చిత్రం డిజిటల్ ప్రీమియర్‌కు రానుండటం గమనార్హం. జూన్ 11, 12 తేదీల్లో తెలుగు, తమిళ భాషల్లో విడుదలైన ఈ చిత్రం, వినూత్న కథనంతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. సంగీతం, ఫాంటసీ అంశాల మేళవింపుతో రూపొందిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. అయాన్, అహల్య, షాలిని ప్రధాన పాత్రలు పోషించగా, నాగ్ అశ్విన్ తన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, కేవీ అనుదీప్, రాహుల్ రవీంద్రన్, నివేదా పేతురాజ్ అతిథి పాత్రల్లో మెరిశారు. తండ్రి ఆస్తుల కోసం కుబేరపురం అనే మైనింగ్ టౌన్‌కు వెళ్లిన కథానాయకుడు, అక్కడ మాటలు పాటలుగా మారే ఓ విచిత్రమైన శాపం గురించి తెలుసుకుంటాడు. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలే ఈ చిత్ర ఇతివృత్తం. తెలుగు, తమిళ భాషలతో పాటు కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఓటీటీ వెర్షన్ కోసం క్లైమాక్స్ విజువల్స్‌ను మరింత మెరుగుపరిచారని వార్తలు వస్తున్నాయి. దీనిపై నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com